క్లుప్తంగా

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



మండపంలో జేసీబీతో డ్రైన్‌లో పూడిక తీస్తున్న దృశ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని మండపం గ్రామ సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం అన్నారు. మండలంలోని మండపంలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాణిక్యం మాట్లాడుతూ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

శివాలయంలో సంప్రోక్షణ పూజలు



గోకవరం శివాలయంలో సంప్రోక్షణ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఇటీవల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అలాగే మండపాన్ని పునర్నిర్మించారు. ఈ మండపాన్ని ఆదివారం ప్రారంభించడంతో పాటు మండపంలో పరివార దేవతలకు స్థాపన కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్వామి వారికి మహాసంప్రోక్షణ పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సమావేశం



గోకవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

గోకవరం: స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం బీజేపీ నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన పలువురు బీజేపీలోకి చేరారు. బీజేపీ గోకవరం మండలాధ్యక్షుడిగా సత్తి వెంకటరెడ్డి, కార్యదర్శిగా ఇనకోటి బాపన్నదొరలను నియమించారు. అనంతరం దేశాభివృద్ధికి కృషి చేస్తామని పార్టీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, ఏలూరి జిల్లా ఇన్‌చార్జి ఏపీఆర్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, జగ్గంపేట కన్వీనర్ డి.కృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



గజ్జనపూడిలో నరికేసిన భారీ చెట్టు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడిలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. గ్రామంలో ఆర్ అండ్ బీ రహదారికి ఆనుకొని ఉన్న భారీ వృక్షాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తొలగించాడు. చెట్టును నరికివేయడంతో ఒక్కసారి నేలకొరిగింది. చెట్టును ఆనుకొని ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు, ఇంటి సర్వీస్ వైర్లు తెగిపడ్డాయి. ఫలితంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆ పరిసర ప్రాంతాల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారులకు ముందస్తు సమాచారం అందించి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని స్థానికులు వాపోయారు.

టీడీపీ శ్రేణుల దీక్షలు

ప్రత్తిపాడు: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ప్రత్తిపాడులో టీడీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు ఆదివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టాయి. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యాన సాయంత్రం వరకూ ఈ దీక్షలు కొనసాగాయి.

జగ్గంపేటలో..

జగ్గంపేట: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టు కావడంతో జగ్గంపేటలో ఆదివారం టీడీపీ శ్రేణులు నిరసన ర్యాలీ, దీక్షలు చేపట్టారు. తొలుత గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక ట్రావెలర్స్ బంగ్లా వద్ద దీక్షలు చేశారు.

కొరికి పడేస్తాయ్

- వరి పంటపై ఎలుకల దాడి
- దిగుబడులు నష్టపోతున్న అన్నదాతలు
- సామూహిక ఎలుకల నివారణతో మంచి ఫలితాలు
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



జగన్నాథపురంలో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కోటనందూరు: మెట్ట ప్రాంత ఆహార పంటల్లో వరి ప్రధానమైంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగులో కలుపు, తెగుళ్ల బెడదతో పాటు ఎలుకల దాడి కూడా ఎక్కువగా ఉంది. ఎలుకలు పంటను వివిధ దశల్లో పాడు చేసి దిగుబడులకు భారీ నష్టం కలిగిస్తున్నాయి. పుష్కలంగా నీటి లభ్యత, కలుపు ఉన్న చోట ఎలుకల బెడద ఎక్కువగా ఉంటోంది. సకాలంలో రైతులు సామూహిక ఎలుకల నివారణ చేపడితే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

38,555 ఎకరాల్లో వరిసాగు

ఈ ఏడాది తుని సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 38,555 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ విస్తీర్ణంలో సుమారుగా 5 వేల టన్నుల దిగుబడికి ఎలుకల వల్ల నష్టం వాటిల్లుతుందని అంచనా. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటపై తెగుళ్ల బెడదతో పాటు ఎలుకల ప్రభావం అధికంగా ఉందని రైతులు చెబుతున్నారు. సాగునీటి లభ్యత ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, వెడల్పు గట్లపై కలుపు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎలుకలు పంటకు నష్టం కలిగిస్తున్నాయి.

పిలకలు పెట్టే దశలో..

ఎలుక పంటను పిలకలు వేసే సమయంలో 5–10 సెంటీమీటర్ల ఎత్తులో కొరికేస్తుంది. ఎలుకలు పిలకలను తినడం కంటే కొరకడానికి అధిక ప్రాధాన్యం ఇస్తాయి. దానికి కారణం వాటికి రెండు జతల కొరికే దంతాలు ఉంటాయి. ఆ దంతాలు రోజూ 0.4 సెంటీమీటర్ల చొప్పున పెరుగుతూ ఉంటాయి. వాటిని అరగదీసుకునే ప్రయత్నంలో పంటను పాటు చేస్తాయి. వరి పిలకలు వేసే సమయంలో ఎలుకల సంతానోత్పత్తి కూడా ఎక్కువగా ఉండి పంటకు భారీ నష్టం కలిగిస్తాయి.

చిరుపొట్ట దశలో..

చిరుపొట్ట దశలో ఎలుక చేసే నష్టం చాలా కీలకం. వరి దుబ్బులను గట్ల వెంబడే కాకుండా పంట మధ్యలో కూడా కొరికి నష్టం కలిగిస్తుంది. దీని వల్ల అక్కడక్కడా ఖాళీలు కనిపిస్తాయి. పంట పాలు పోసుకున్న తరువాత బొరియల్లో ధాన్యపు గింజలను నిల్వ చేయడం ద్వారా కూడా నష్టం కలిగిస్తాయి. ఇలా ఎకరాకు రెండు నుంచి మూడు బస్తాల వరకూ నష్టాన్ని కలిగిస్తాయి.

ఎలుకలకు అనుకూల పరిస్థితులు

కాలువల కింద పండించే వరి పంటలో ఎలుకల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నిరంతర ఆహారం, నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాలు, సాగునీటి కాలువలు, ఉద్యాన పంటలైన కొబ్బరి, కోకో, ఆయిల్ ఫాం తోటలను ఆనుకొని సాగు చేసే ప్రాంతాల్లో ఎలుకల ప్రభావం ఎక్కువ.

సమగ్ర యాజమాన్యం అవసరం

ఎలుకల నివారణకు సేద్య, భౌతిక, యాంత్రిక, పొగబారించడం వంటి అనేక పద్ధతులు అందుబాటు ఉన్నాయి. కాగా తక్కువ ఖర్చుతో ఎలుకలను నివారించేందుకు రసాయన పద్ధతిలో ప్రభుత్వం సామూహిక ఎలుకల నివారణను ప్రోత్సహిస్తోంది. ఈ విధానంపై రైతులకు వ్యవసాయాధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందును పంపిణీ చేస్తున్నారు.

బ్రోమోడయోలిన్ మందు తయారీ

ఒక కేజీ బ్రోమోడయోలిన్ మందు తయారీకీ 960 గ్రాముల నూకలు, రెండు గ్రాములు బ్రోమోడయోలిన్ మందు, రెండు గ్రాముల నూనె చొప్పున కలిపి మిశ్రమం చేయాలి. అలా చేసిన మిశ్రమాన్ని ఒక ప్రాంత రైతులంతా సామూహికంగా ఎలుక బొరియల్లో పెట్టడం ద్వారా ఎలుకలను నివారించుకోవచ్చు. ఎకరానికి కేజీ చొప్పున, 1, 11 రోజుల వ్యవధిలో మందును ఎలుకల బొరియల్లో పెట్టాలి.

రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు



ఎలుకలను పూర్తి స్థాయిలో అరికట్టాలంటే రైతులంతా సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలి. పొలం గట్లు వెడల్పు తగ్గించి కలుపు లేకుండా చూసుకుంటే ఎలుకల సమస్య ఉండదు. **రైతులకు ప్రభుత్వం ఉచితంగా** ఎలుకల నివారణ **మందును సరఫరా చేస్తోంది.** ఎలుకల నివారణలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– కె.చంద్రశేఖర్, వ్యవసాయాధికారి, కోటనందూరు

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



ఏలేశ్వరంలో కమిషనర్ కొండలరావును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ కమిషనర్ కొండలరావును పట్టణంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. కమిషనర్ కొండలరావు అనకాపల్లి జిల్లా యలమంచిలి బదిలీపై వెళ్లడంతో వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ నగర పంచాయతీ కమిషనర్‌గా కొండలరావు సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ సేవల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, సిరిపరపు రాజేష్, సామంతుల చిన్నారావు, చందక కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో 144 సెక్షన్ అమలు

గోకవరం: గోకవరం మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్సై యువి శివనాగబాబు ఆదివారం తెలిపారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. పబ్లిక్ స్థలంలో ముగ్గురు కంటే ఎక్కువ మంది ఉండకూదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



25 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తుని: స్థానిక రాజా ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 వసంతాల తరువాత బమ్మిడిపల్లి మూర్తి, కటారి వీర్రాజు ఆధ్వర్యంలో తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఆలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. ఒకరి కష్టసుఖాలను మరొకరికి చెప్పుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. అలనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన హెడ్‌మాస్టారు శేషగిరి, ఉపాధ్యాయులు నారాయణమూర్తి, జోగిశాస్త్రి, కృష్ణమూర్తి దంపతులను సన్మానించారు. పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారిపై ఇరుక్కుపోయిన ఊకలోడు లారీ



జగన్నాథపురం శివారులో ప్రధాన రహదారిపై ఇరుక్కుపోయిన ఊక లోడు లారీ

గోకవరం: మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారున ప్రధాన రహదారిపై ఆదివారం ఊక లోడు లారీ ఇరుక్కుపోయింది. భారీ లోడుతో ఉన్న ఊక లారీ గోతిలో పడి ఇరుక్కుపోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకకరించారు.

చట్టం ముందు అందరూ సమానమే

- వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం

జగ్గంపేట: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడికి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో తప్పులు చేసిన వారు ఎంతటివారైనా న్యాయస్థానం ముందు సమానమేనని రుజువైందని వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు ఆర్థిక నేరాలను కప్పిపుచ్చేందుకు టీడీపీ నేతలు చంద్రబాబు అరెస్టును ప్రభుత్వ కుట్రపూరిత చర్యగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం తన లొసుగులను కప్పిపుచ్చుకున్నారన్నారు. ప్రస్తుతం కేసుల నుంచి బయటపడేందుకు రూ.కోట్లు పెట్టి లాయర్లను రప్పించుకున్నా ఫలితం లేకపోయిందన్నారు. చంద్రబాబు తప్పు చేయకపోతే వ్యవస్థలకు సహకరించి నిరూపించుకోవాలని సూచించారు.

అక్రమార్జనతోనే చంద్రబాబు అరెస్టు

గండేపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. కేంద్ర సంస్థల దర్యాప్తులో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడని తేలడంతో సీఐడీ అరెస్టు చేసిందన్నారు. నంద్యాలలో అరెస్టు చేసిన దగ్గర నుంచి సీబీఐ కోర్టు రిమాండ్ తీర్పు వచ్చేంత వరకూ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతతో సమన్వయంగా వ్యవహరించారన్నారు. సీఐడీ సిబ్బంది, పోలీసులు వ్యవహరించిన తీరు చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు.

నిత్యకల్యాణంలో దండిగా కానుకలు

- ఆదివారం ఒక్కరోజే రూ.10,200 సమర్పించిన భక్తులు
- గత నెల 13 నుంచి ఇప్పటి వరకూ రూ.70 వేల ఆదాయం



రత్నగిరిపై స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: సత్యదేవుని నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి, అమ్మవార్లకు కట్న కానుకలు దండిగా సమర్పిస్తున్నారు. శ్రావణ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం కల్యాణ భక్తులు రూ.10,200 కట్నకానుకలు సమర్పించారు. గత నెల 13వ తేదీ నుంచి భక్తులు కట్నకానుకలు సమర్పించే విధానాన్ని ఈఓ చంద్రశేఖర్ అజాద్ పునరుద్ధరించిన విషయం తెలిసిందే. దేవస్థానానికి కట్న కానుకల రూపంలో ఇప్పటివరకూ సుమారు రూ.70 వేలు ఆదాయం వచ్చింది. దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వర శర్మ, అర్చకులు రామ్‌కుమార్, పురోహితులు పాలంకి పట్టాభి తదితరులు ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం కామేశ్వరశర్మ స్వామివారికి కట్న కానుకలు సమర్పించాలని కోరారు. దీంతో భక్తులు వెల్లువగా వచ్చి కట్నకానుకలు సమర్పించారు. రూ.500 కన్నా తక్కువ నగదును హుండీలో వేశారు. రూ.558 కన్నా ఎక్కువ మొత్తాలను రికార్డులో రాసి వారి గోత్రనామాలను పండితులు చదివి ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిత్య కల్యాణం..పచ్చతోరణం..

సత్యదేవుని సన్నిధిలో ప్రతి నిత్యం సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారికి ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు స్వామివారికి కల్యాణం నిర్వహిస్తారు. శ్రావణం, ఆశ్వయుజం, కార్తికం, మాఘం, వైశాఖం వంటి మాసాల్లో రోజుకు 50 మంది వరకూ భక్తులు రూ.1,116 టిక్కెట్‌తో స్వామివారి కల్యాణంలో పాల్గొంటారు. మిగిలిన రోజుల్లో భక్తుల సంఖ్య తక్కువగా ఉంటుంది. ఏటా స్వామివారి కల్యాణాలు సుమారు ఐదు వేలు జరుగుతున్నాయి.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు



గోనేడలో ఎడ్ల పరుగు పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

కిర్లంపూడి: మండలంలోని గోనేడలో ఆదివారం జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. గ్రామంలో రూ.25 లక్షలతో వరెలమ్మ అమ్మవారి నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ అల్లు విజయ కుమార్ ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల పోటీలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 20 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పెద్దాపురం మండలం మర్లావ గ్రామానికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానం, గోనేడ గ్రామానికి చెందిన ఎడ్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సర్పంచ్ అల్లు విజయ్ కుమార్, ఎంపీటీసీ అల్లు శివరామకృష్ణ, మండల జనసేన అధ్యక్షుడు ఐ.రాజు విజేతలకు బహుమతులు అందజేశారు.

జోరుగా అపరాల పంట ఒబ్బిడి



చామవరంలో సాగు చేసిన మినప పంట



పక్వానికి వచ్చిన మినప కాయలు

తుని రూరల్: వేసవిలో ఆరుతడిగా సాగు చేసిన అపరాల పంటలను రైతులు ఒబ్బిడి చేస్తున్నారు. పండిన మినము, పెసర, కొమ్ము శెనగ చేలను కోసి పొలంలోనే ఎండబెడుతున్నారు. కొంతమంది రైతులు ఎండిన పంట నుంచి అపరాలు సేకరిస్తున్నారు. తుని మండలంలోని ఎస్.అన్నవరం, చామవరం, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురం, దొండవాక, కొలిమేరు, ఎన్.సూరవరం తదితర గ్రామాల్లో రైతులు అపరాల సాగు చేస్తున్నారు. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 180 ఎకరాల్లో రైతులు అపరాలు సాగు చేసినట్టు వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. కాగా అపరాల పంట కోతలు ఈ నెలాఖరుకు పూర్తవుతాయని చెప్పారు. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరిసాగు చేయలేని రైతులు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగు చేయాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు.

చవితి ఉత్సవాలకు ముస్తాబు

- జెడ్.రాగంపేటలో గణపతి విగ్రహాల తయారీ
- ఇప్పటికే అడ్వాన్స్‌లు ఇచ్చిన భక్తులు
- గ్రామాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు



జెడ్.రాగంపేటలో విగ్రహాలకు రంగులు వేస్తున్న కళాకారుడు

గండేపల్లి: గ్రామాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాల సందడి ప్రారంభమైంది. కొన్నికోట్ల ఇప్పటికే ఉత్సవాలకు రాట ముహూర్తాలు చేశారు. కాగా చవితి ఉత్సవాలకు విగ్రహాలు సైతం ముస్తాబు అవుతున్నాయి. ఈ నెల 18న వినాయక చవితి కావడంతో ఆలయ కమిటీ సభ్యులు ఇప్పటికే తమకు కావాల్సిన రీతిలో విగ్రహాలు తయారు చేయించుకుంటున్నారు. తయారీదారులు రెండు నుంచి 20 అడుగుల వరకు విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. భక్తులు విగ్రహాలకు ముందుగా అడ్వాన్స్‌లు చెల్లించి తమకు కావాల్సిన రంగులు, వివిధ రూపాల్లో గణనాథుని విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు.

విగ్రహాల తయారీతో ఉపాధి

మండలంలోని జెడ్.రాగంపేట సాయి ఆస్పత్రి సమీపంలో రాజస్థాన్‌కు చెందిన సుమారు పది మంది కళాకారులు గత కొన్నేళ్లుగా గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు. నియోజకవర్గంలోని కిర్లంపూడి, జగ్గంపేట, గోకవరం, గండేపల్లి మండలాలకు చెందిన భక్తులు ఏటా ఇక్కడే విగ్రహాల తయారీకి ఆర్డర్లు ఇస్తారు. తమ కుటుంబ సభ్యులతో పాటు రాజస్థాన్‌కు చెందిన కొందరు కార్మికులను ఇక్కడకు తీసుకువచ్చి విగ్రహాలను తయారు చేయిస్తున్నట్టు కళాకారుడు కీరారామ్ తెలిపారు. ఈ విగ్రహాల తయారీ కోసం సుమారుగా రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టామని, భోజనం సదుపాయం కల్పించి ఒక్కొక్క వ్యక్తికి నెలకు రూ.10,000 జీతం ఇస్తున్నామన్నారు. కాగా ఈ ఏడాది విగ్రహాల అమ్మకాలు బాగుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే వినాయక చవితిని పురస్కరించుకుని కొందరు వ్యాపారులు పలు ప్రాంతాల నుంచి విగ్రహాలను తీసుకువచ్చి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. గ్రామాల్లోని పలు చోట్ల చలువ పందిళ్లు, మండపాలు వేసేందుకు భక్తులు స్థలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం



నరసయ్యపేటలో పందిరి రాట వేస్తున్న భక్తులు

కిర్లంపూడి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వినాయక చవితి వేడుకలకు శ్రీకారం చుట్టారు. జగపతినగరం నరసయ్యపేటలోని వినాయకుని ఆలయం వద్ద పందిరి రాట వేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్టీలెవెల్ పార్కింగ్ స్థలంలో 225 కార్ల నిలిపివేత



సత్యగిరి పక్కన మల్టీలెవెల్ పార్కింగ్ స్థలంలో నిలిపివేసిన కార్లు

అన్నవరం: భక్తుల వాహనాలు నిలిపివేసేందుకు దేవస్థానంలోని సత్యగిరి దిగువన ఏర్పాటు చేసిన మల్టీలెవెల్ పార్కింగ్ స్థలంలో ఆదివారం 225 కార్లు నిలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో ఇక్కడ కార్లను నిలిపివేయడం ఇదే ప్రథమం. వివాహాల సీజన్, శని, ఆదివారాలు సెలవు కావడంతో దేవస్థానానికి వందలాది వాహనాల్లో పెళ్లిబృందాలు, భక్తులు వచ్చారు. వీరి వాహనాలను నిలిపివేయడానికి దేవస్థానంలో పార్కింగ్ స్థలం సరిపోకపోవడంతో మల్టీలెవెల్ పార్కింగ్‌లో నిలిపివేశారు. ఇక్కడ సుమారు 600 కార్లు నిలిపివేసేలా స్థలాన్ని చదును చేయించినట్టు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు.

మండపం నిర్మాణానికి భూమిపూజ



లోవకొత్తూరులో మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు, దాతలు

తుని రూరల్: లోవకొత్తూరులో తలుపులమ్మ అమ్మవారి ఉప ఆలయం ఎదుట మండపం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. తునికి చెందిన దాత మాగపు వీర వెంకట ఆంజనేయులు అమ్మవారి ఉపాలయం వద్ద మండపం నిర్మించేందుకు అంగీకరించి భూమి పూజ చేశారు. ఆలయ ఈఓ ఆదేశాల మేరకు ఏఈలు వీరభద్రరావు, శ్రీను మార్కింగ్ చేయగా దాత కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. మండపానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని దాత చెల్లించనున్నారు. లోవకొత్తూరులోని తలుపులమ్మవారి ఉప ఆలయం వద్ద ఏటా గంధామావస్య పర్వదినాల్లో 12 రోజుల పాటు తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ. మండపం నిర్మాణంతో ఉపాలయం అభివృద్ధి చెందనుంది.